
# కేబినెట్‌లో చోటేది ?

- ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం కరువు
- కొలువుదీరిన కొత్త ప్రభుత్వం
- తొలి విడుతలో దక్కని అవకాశం
- నిరాశలో ఆశావహులు
- రెండో దఫా మంత్రివర్గ విస్తరణపైనే ఆశలు



నిజామాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గురువారం కొలువైంది. ముఖ్యమంత్రిగా కొడంగల్ ఎమ్మెల్యే అనుముల రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. సీఎంతో పాటు మొత్తం 12మంది ప్రమాణ స్వీకారం చేయగా ఇందులో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ప్రాధాన్యత దక్కలేదు. ఆది నుంచి కాంగ్రెస్ పార్టీ వస్తే తమకు మంత్రి పదవులు వస్తాయనుకున్న నేతలకు అసలు గుర్తింపే లేకపోవడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నాలుగు చోట్ల కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. బోధన్ నుంచి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ నుంచి డాక్టర్ భూపతి రెడ్డి, ఎల్లారెడ్డి నుంచి మదన్ మోహన్ రావు, జుక్కల్ నుంచి లక్ష్మీకాంతరావు విజయం సాధించారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో సుదర్శన్ రెడ్డి, మదన్ మోహన్ రావుకు మంత్రి వర్గంలో చోటు దక్కుతుందని ఆశించారు. నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ సైతం మైనార్టీ కోటాలో తనకు తప్పకుండా మంత్రి మండలిలో స్థానం దక్కుతుందని భావించారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన వారితో పాటు ఏఐసీసీలో పేరొందిన నేతలకు సైతం రేవంత్ రెడ్డి తొలి విడుత మంత్రివర్గంలో చోటు దక్కకపోవడం ఏమిటని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.

**రెండో విడుతలో...?**

తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటయ్యే ప్రభుత్వంలో మంత్రివర్గ కూర్పు తప్పనిసరిగా భౌగోళిక ప్రాంతాలను అనుసరించి ఉంటుంది. అందులో ఉమ్మడి జిల్లా ప్రాధాన్యతగా ఎవరికో ఒకరికి తప్పకుండా మంత్రివర్గంలో చోటు దక్కడం ఖాయమే. కాంగ్రెస్‌కు నాలుగు సీట్లను అందించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను మొదటి విడుత మంత్రివర్గ కూర్పులో స్థానం కల్పించకపోవడమే అందరిలోనూ అనుమానాలకు తావిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏకంగా ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో చోటు కల్పించారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ రెండేసి చొప్పున మంత్రి పదవులను ఏఐసీసీ కట్టబెట్టింది. ఉమ్మడి జిల్లాలో సీనియర్ లీడర్లు ఉన్నప్పటికీ చోటు కల్పించకపోవడం ఏమిటంటూ హస్తం పార్టీ నేతలు గుసగుసలాడుతున్నారు. రెండో విడుత మంత్రి వర్గ విస్తరణ ఎప్పటికి జరుగునో అనుకుంటూ నిట్టూరుస్తున్నారు. కాంగ్రెస్ నాయకుల ఊహాగానాల ప్రకారం ఉమ్మడి జిల్లా నుంచి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుతో పాటు షబ్బీర్ అలీ సైతం పోటాపోటీగా మంత్రి పదవి కోసం పైరవీలు చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. వీరిలో ఎవరికి మంత్రి యోగం వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది. బుధవారం ఢిల్లీలో రేవంత్ రెడ్డితో పాటు ఏఐసీసీ పెద్దలతో ఉమ్మడి జిల్లాకు చెందిన సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ వరుస భేటీలు నిర్వహించారు. తదనంతరం వీరిలో ఎవరో ఒకరికి పదవి తథ్యమని అంతా ఊహించుకున్నారు. అంతలోనే ఎవరికీ స్థానం కల్పించకపోవడం విశేషం.

## స్వగ్రామానికి చేరిన మృతదేహాలు



రవి, ప్రశాంత్(ఫైల్)

సదాశివనగర్, డిసెంబర్ 7 : బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నెల 3వ తేదీన ప్రమాదం జరగ్గా గురువారం రోజున మృతదేహాలు స్వగ్రామానికి చేరాయి. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సదాశివనగర్ మండలంలోని కల్వరాల్ గ్రామానికి చెందిన అంగూర్ ప్రశాంత్, గుర్రపు రవి బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లారు. ఈ నెల 3వ తేదీన దుబాయ్‌లో జాతీయ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వీరిద్దరూ కారులో వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు. దీంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. గురువారం మృతదేహాలు గ్రామానికి చేరడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

## బీఆర్ఎస్ నాయకుడికి బెదిరింపులు

మాచారెడ్డి, డిసెంబర్ 7 : మాజీ మంత్రి షబ్బీర్ అలీ సోదరుడు నహీం తనను ఫోన్‌లో బెదిరించాడని బీఆర్ఎస్ నాయకుడు, మాచారెడ్డి ఎంపీటీసీ రావుల వినోద భర్త ప్రభాకర్ తెలిపాడు. రెండు రోజుల క్రితం తనకు ఫోన్ చేసి కాంగ్రెస్ తరఫున ఎంపీటీసీగా గెలిచిన వినోద బీఆర్ఎస్ పార్టీలోకి ఎలా వెళ్లిందని దుర్భాషలాడుతూ ఇంటికి పోలీసులకు పంపి కొట్టిస్తానని బెదిరించాడని వాపోయారు. ఆయన నుంచి తనకు ప్రాణహాని ఉన్నదని.. ఈ విషయం పై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## అనుమతులు లేకుండా విగ్రహాలను నెలకొల్పరాదు

- డ్రోన్ కెమెరాలు వినియోగించడం పూర్తిగా నిషేధం
- డీజేలు,హై రేంజ్ సౌండ్ సిస్టం వాడకూడదు
- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 7 : రోడ్ల పక్కన ఖాళీ స్థలాలు, పార్కులు, కాలనీల్లో విగ్రహాలను ఏర్పాటు చేయడం నిషేధించినట్లు పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. కలెక్టర్, సంబంధిత అధికారుల నుంచి అనుమతులు లేకుండా ఎవరూ విగ్రహాలు నెలకొల్పరాదని స్పష్టం చేశారు.



శుభకార్యాలు, ఇతర సమావేశాలు, సభల సందర్భంగా డ్రోన్ కెమెరాలను ఎట్టి పరిస్థితిలోనూ వినియోగించరాదన్నారు. అధికారుల నుంచి అనుమతి పొందకుండా ఎవరైనా డ్రోన్స్ వినియోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజే, హై వాల్యూమ్ సౌండ్ సిస్టం సైతం వాడకూడదని, దీంతో జనానికి ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఈ సిస్టం వాడడాన్ని నిషేధించినట్లు సీపీ వెల్లడించారు. ఎవరైన తప్పని సరి పరిస్థితుల్లో సౌండ్ సిస్టమ్ వాడాల్సి ఉంటే దాని కోసం సంబంధిత ఏసీపీల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్స్, హోటళ్లలో వినియోగదారుల సంరక్షణార్థం అవసరమైన సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి వ్యాపార సంస్థల నిర్వాహకులు, యజమానులు ఈ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు పాటించకుంటే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీపీ కల్మేశ్వర్ పేర్కొన్నారు.

## బోర్గాం పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

- మధ్యాహ్న భోజనం అనంతరం 16 మందికి వాంతులు
- దవాఖానకు తరలించిన ఉపాధ్యాయులు
- ప్రమాదం లేదన్న వైద్యులు
- కారణాలు తెలుసుకునే పనిలో అధికారులు



జిల్లా కేంద్ర దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మోపాల్(ఖలీల్‌వాడి), డిసెంబర్ 7 : బోర్గాం ప్రభుత్వ పాఠశాలలో గురువారం మధ్యాహ్నం విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్న భోజనం చేసిన 2 గంటల తర్వాత ఇద్దరు విద్యార్థులు కడుపులో నొప్పి వస్తుందని చెప్పగా ఉపాధ్యాయులు డాక్టర్‌ను పిలిపించి మందులు వేశారు. ఆ తర్వాత మరి కొందరికి కడుపునొప్పి రావడంతో పాటు ఒకరిద్దరు వాంతులు చేసుకున్నారు. దాంతో అప్రమత్తమైన ఉపాధ్యాయులు అంబులెన్స్ ద్వారా విద్యార్థులను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మొత్తం 150 మంది విద్యార్థులు భోజనం చేయగా నాల్గో తరగతి చదువుతున్న 16 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఎంఈవో రామారావు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అపాయం లేదని వైద్యులు తెలిపారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు బయట నుంచి కొనుగోలు చేసిన తినుబండారాలతోనే అస్వస్థత జరిగి ఉండవచ్చన్నారు. లేని పక్షంలో 1, 2, 3వ తరగతి విద్యార్థులకు కూడా అస్వస్థతకు లోనయ్యే వారని ఎంఈవో తెలిపారు. మధ్యాహ్న భోజనంతో జరిగిందా ? విద్యార్థులు బయట నుంచి తెచ్చుకున్న ఆహారంతో జరిగిందో తెలియాల్సి ఉంది.

## నేడు జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం

కామారెడ్డి, డిసెంబర్ 7 : జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో సాయాగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రస్థాయి పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి


కామారెడ్డి, డిసెంబర్ 7 : జిల్లాలోని దివ్యాంగులు రాష్ట్రస్థాయి పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ, మహిళా, శిశు, దివ్యాంగుల వయో వృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ శాఖ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం-23 సందర్భంగా రాష్ట్రస్థాయి పురస్కారాలను అందుకొనుటకు దివ్యాంగుల నుంచి అర్హులైన వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. బెస్ట్ ఎంప్లాయిస్, బెస్ట్ ఇండివ్యుజల్ సోషల్ వర్కర్, బెస్ట్ స్పోర్ట్స్ పర్సన్, బెస్ట్ ఇన్‌స్టిట్యూషన్, బెస్ట్ పర్సన్ విత్ డిసబిలిటీస్ ఇన్ కల్చరల్ యాక్టివిటీస్ తదితర వాటిల్లో స్త్రీలు, పురుషులు బెంచ్ మార్కు వైకల్యం ఉన్న వ్యక్తులు ఆన్‌లైన్‌లో wdsc.telangana.gov.in లేదా https://forms.gle/xhL9pxhKADzHvtp9 ద్వారా ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ
CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**
★Requirement: Experienced site engineer for construction site Experienced site supervisor for construction site Contact: 9052865599
NTZ-318491

**WANTED**
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, జీటీకర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

**CHANGE OF NAME**
I, R.VIJAYA LAXMI D/o. GANGARAM H.No.1-26/31, Ganga Tower, Flat No.404, Perkit, Armoor, (D) Nzb. Changed my surname / Name as CHAUHAN ANUSHA W/o. CHAUHAN YASHWANTH RAO



**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.